కథా నిలయం
శ్రీకాకుళం

# కవి గోపాలం

గోపాలానికో కోరిక కలిగింది. కవితలు బాగా రాయాలని. కవిగా ఓ వెలుగు వెలగాలని.ఆ ఉబలాటం నానాటికీ పెరగసాగింది.

పుంఖాను పుంఖాలుగా కవితలు రాసి, ఆంధ్ర దేశాన్ని ఒక ఊపు ఊపాలని, ఆ ఊపులో తనూ ఊగిపోవాలని ఉవ్విళ్ళూరుతున్నాడతను.

ఆలోచనైతే బాగానే వుందిగానీ సాహిత్యం వొంటబట్టొద్దూ...? ఏవేవో నాలుగు పదాలు కలిపి దానికో టైటిల్ తగిలించేసి అదే కవిత్వమనుకుని భ్రమసి మురిసిపోతున్నాడు.

అయితే 'ఇంట గెలిచి రచ్చ గెలవాలన్న' తలంపుతో మొదట భార్య మన్ననలు పొంది ఇతరుల మెప్పు పొందాలని తనకు తానే ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నాడు.

అనుకోవడమే ఆలస్యం భార్య ఉమామహేశ్వరిని కేకేసి పిల్చాడు.

వంటింట్లోంచి పరుగు పరుగున వచ్చిన భార్య ఏమిటన్నట్లు ఎదురుగా నిలబడింది. 'ఆలస్యం అమృతం విషం' అన్న చందాన ఫైల్‌లోంచి ఓ కాగితం తీసి రాగయుక్తంగా ఓ కవితను చదివేశాడు.

ఆ కవిత వింటున్నంత సేపూ ఆమెకి ఒళ్ళంతా పాములూ, జెర్రులూ పాకినట్టనిపించింది.

కవిగోపాలమేమో చదవడం పూర్తిచేసి భార్య ప్రశంసల కోసం ఆదుర్దా పడసాగాడు.

'మనిషికి ఏదో గాలి సోకినట్టుంది.లేకపోతే ఏంటా పిచ్చి పిచ్చి రాతలు...' అనుకుని గాభరా పడసాగింది.

భార్య ఎంతకీ తనని పొగడకపోవడంతో "ఎలా వుంది కవిత?" అనడిగాడు చిద్విలాసంగా.

"మరోసారిలాంటి తిక్కతిక్క తింగరి వేషాలు వేశారో జాగ్రత్త! మా పుట్టింటికి పారిపోతా" నంటూ రయ్‌మని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

భార్య బెదిరింపుకి ఖంగుతిన్నాడు కవిగోపాలం.

ఆనక, 'చదువురాని తన భార్యామణికి కవిత్వాన్ని వినిపించడం బుద్ధితక్కువ పని కాకపోతే మరేంటని?' తనని తానే నిందించుకున్నాడు.

రెట్టింపు ఉత్సాహంతో జనంమీద పడ్డాడు. కవిగోపాలం కవితల బారిన పడిన జనం పాపం తట్టుకోలేకపోయారు. కక్కలేక మింగలేక గిలగిలా గింజుకున్న వాళ్ళెందరో ఉన్నారు.

కవిగోపాలం అనబడే అయిదక్షరాలు జనాలకి సింహస్వప్నంలా తోచసాగాయి.శాల్తీ కనబడితే చాలు తప్పించుకోవడం మొదలుపెట్టారు.

ఎవరు విన్నా వినకపోయినా తన ఆలోచనా సరళి మాత్రం మార్చుకోలేదు.

శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, విశ్వనాధ వంటి వారు బ్రతికుంటే బాగుండేది. బ్యాడ్‌లక్ అనుకున్నాడు. అయితే ఈ బ్యాడ్‌లక్ అనేది తన విషయంలో కాదు. ఆ మహాకవుల పరంగా రసగుళికల్లాంటి తన కవితలు వినే భాగ్యానికి వాళ్ళంతా నోచుకోలేకపోయారని అతడి బాధ.

పైగా కవిగోపాలం బుర్రలో మెరుపులాంటి ఆలోచనొకటి తళుక్కున మెరిసింది. ఆ ఆలోచన తట్టినందుకు మహదానంద పడిపోయాడుకూడాను.

అదేంటంటే-

ఎదురుగా కవిత్వం వినిపించడం పురాతన పద్ధతి అని భావించి సరికొత్త పద్ధతినొకటి ఫాలో అవ్వాలనుకున్నాడు.

అనుకున్నదే ఆలస్యం టెలిఫోన్ డైరెక్టరీ ముందేసుకు కూర్చున్నాడు.

ఏ ఒక్కటీ మిస్సవ్వకుండా రోజుకి కొన్ని నెంబర్లు టార్గెట్ పెట్టుకుని డయల్ చేయసాగాడు.

అవతలి వైపు నుండి 'హలో!' అని విన్పించడం ఆలస్యం తన కవితల్ని వదలసాగాడు. వీటికి సరికొత్తగా 'టెలిఫోన్‌కవితలు' అని పేరుపెట్టాడు.పైగా ఈ 'టెలిఫోన్ కవితల్ని' ఏ పత్రికకి పంపి ఆ పత్రిక సర్క్యులేషన్ అనూహ్యంగా పెంచాలా అని కూడా ఆలోచించాడు.

అయితే కవి గోపాలం టెలిఫోన్ దాడి ఊళ్ళోవాళ్ళందరికీ గుప్పుమని పాకిపోయింది. ఇకనేం ఇంట్లో ట్రింగ్‌మనే శబ్దం వినిపిస్తే చాలు... ఎనిమిదవ వింతలా 'టెలిఫోన్ షాక్' కొట్టినట్లు వణికిపోసాగారు ఫోన్ ఉన్న జనం.

ఇలాంటి కవి గోపాలం ఏకంగా రచయిత కూడా అయ్యాడు. ఆ వైనమేమిటో తెలియాలంటే కథలోకి వెళ్ళాల్సిందే....

* * *

"కవి గోపాలం గారూ! నన్ను మీరే కాపాడాలి" అంటూ పరుగెత్తుకొచ్చాడొక గుర్తు తెలియని వ్యక్తి. విదేశీ అణుబాంబులొచ్చి తలమీద పడ్డంత కంగారుగా.

గయుడికి అభయమొసంగిన అర్జునుడిలా 'ష్యూర్' అన్నట్టు ఆ వ్యక్తి చేతిలో చెయ్యేశాడు కవి గోపాలం.

"మా అమ్మాయికి పెళ్ళి చేసి రెండేళ్ళయ్యింది. ఈ మధ్యే పుట్టింటికి వచ్చింది. కట్నమివ్వందే తోలుకుపోనని మా అల్లుడు మంకుపట్టు పట్టాడు. డబ్బేమో మరో ఏడాది వరకూ సర్దుబాటయ్యేటట్లు లేదు. మీరే సాయం చేయాలి" అంటూ తన గోడు వెళ్ళబోసుకున్నాడతను.

"డబ్బెంతివ్వాలి?" అనడిగాడు కవి గోపాలం సీరియస్‌గా.

"యాభై వేలు. అయినా డబ్బెందుకు అడుగుతున్నారు?" ఆశ్చర్యపోయాడతను.

"ఎందుకంటావేమిటయ్యా! డబ్బు సాయం చేయమన్నావుగా!"

"హబ్బే... అంత శ్రమ మీకక్కర్లేద్సార్...'

"మరి..?"

"ఎందుకంటే కట్నం ఇవ్వందే వెళ్ళనని నా కూతురితో పాటుగా మా అల్లుడు భీష్మించుకు కూర్చుంది మా ఇంట్లోనే. అతడ్ని మేపలేక తల ప్రాణం తోకకొస్తోంది. నా అడ్రస్ ఇస్తాను. ఇంట్లోనే నిక్షేపంగా వుండి వుంటాడు. ఏదో ఒకటి తింటూ మా అల్లుడు! వెళ్ళి కొన్ని కవితల్ని వదలకుండా వినిపించండి. చాలది! జీవితం మీద విరక్తి కలిగి తప్పకుండా పెట్టా బేడా సర్దుకుని చెప్పా పెట్టకుండా అతడి పుట్టింటికి పారిపోతాడ్సార్" అని చెప్పాడు వినయంగా.

అది విన్న కవి గోపాలం ముఖంలో సిరా చుక్కలేదు. వేములవాడ జాతరలో పూనకం వచ్చినవాడిలా చిందులు తొక్కసాగాడు.

సంధించి వదలిన బాణంలా పరుగు లంకించుకొన్నాడా వ్యక్తి.

* * *

మరొక రోజు...

మరొకతను హఠాత్తుగా కవి గోపాలం ముందూడి పడి "చంద్రబాబు నాయుడు పదవీ కాలమంతా ప్రపంచబ్యాంకుకి 'ఋణ'పడ్డట్టు... జీవిత కాలమంతా నేను మీకు 'ధన'పడి ఉంటానండి" అంటూ కృతజ్ఞతాపూర్వకంగా చేతులు పట్టుకుని తెగూపాడు.

ఈయన్నెక్కడో చూసినట్టు, కలిసినట్టు, సాయం చేసినట్టు గుర్తు లేదే అనుకుంటూనే "ఏదో మీ అభిమానం అలాంటిది" అంటూ మెలికలు తిరిపోయాడు కవి గోపాలం.

"మీరు పట్టిన కలం!

నా జీవితానికి బలం!!

మీ రాతే...నా తలరాత!!! రాయండ్సార్. కవితల్ని రాసేయండి...గుట్టలు గుట్టలుగా, బండిల్స్ బండిల్స్‌గా" అంటూ కొన్ని ప్రాస నినాదాలిచ్చి, ప్రశంసల వర్షం కురిపించాడు.

అందుకు కవి గోపాలం తబ్బిబ్బవుతూ "ఈ శుభ తరుణంలో ఓ రెండు మినీ కవితలు" అంటూ స్టార్ట్ చేయబోయాడు.

ఆలస్యం కవితలు 'విష'మన్నట్లు పౌరాణిక సినిమాల్లోని దేవతామూర్తిలా వచ్చిన వ్యక్తి వచ్చినంత వేగంగా అదృశ్యమై పోయాడక్కడి నుండి.

పోతూ పోతూ "ఇంతకీ నేనెవర్నో చెప్పనే లేదు కదండీ! భీమా ఏజెంట్‌ని. మీ కవితలకి ఝడుసుకుని ఏ క్షణంలో పోతామో ఎవరికి తెలుసు' అనే భీతిలో జనమంతా భీమా చేస్తున్నారండి. మీ దయ వల్లే నా భీమా వ్యాపారం టీ.వీ.సీరియల్‌లా అనూహ్యంగా మలుపులు తిరుగుతోంది" అనే మాట చెప్పేసి తుర్రుమన్నాడు.

అది విని గాలి తీసిన బెలూన్‌లా గల్లంతయిపోయాడు గోపాలం.

* * *

ఒకనొక క్షణాన కవిగోపాలం బామ్మర్ది పరమేశం ఊడిపడ్డాడు.

పరామర్శల కార్యక్రమమయ్యింది.

"పరం బావా! పరం బావా! ముద్దుముద్దుగా నీకో కవిత తిన్పించాలనిపిస్తోంది... ఛ....ఛ...! విన్పించాలన్పిస్తోంది..." కవి గోపాలం గారాలు పోయాడు.

"అలాగే కానీ బావా!" పరమేశం రెడీ అయ్యాడు వినడానికి.

సిటీ బిటీ మీద సంతకం చేసిన ఇండియాని చూసి ముక్కు మీద వేలేసుకున్న అమెరికాలా తెగ హాశ్చర్యపోయాడు గోపాలం. అతని జీవితంలో కవిత వింటానని ఎదురొడ్డి నిలిచిన సాహసవీరుడు పరమేశం ఒక్కడే.

'ఆహా! చెంతనే దొరికెన్ చెట్టంత శ్రోత' అనే కూనిరాగంతో మొదలెట్టి...

"బకెట్

రాకెట్

భూమీ

ఆకాశం..."

అంటూ 'ఖూనీ' రాగంతో పూర్తి చేశాడు.

అది వింటూనే భళ్ళున వాంతి చేసుకున్నాడు పరమేశం. చెల్లమ్మ చెప్పినట్టు గోపాలమింత పవర్‌ఫుల్ మడిసన్న నిజాన్ని స్వయంగా జీర్ణించుకున్నాడు.

పవర్ దిగాక 'బకెట్ రాకెట్, భూమి, ఆకాశం... వీటిని జతపర్చాలి. అంతేగా బావా?" అనడిగాడు సింపుల్‌గా.

"చంపావ్ పో బావా! జతపర్చడమేంటి నా మొహం. నీకు సాహిత్యంలో ఓనమాలు తెలిసినట్టు లేదు. ఇంక వాటినెలా ఆస్వాదిస్తావ్ నా బొంద" తల బాదుకున్నాడు సదరు గోపాలం.

"మరి పదాలు చెప్పావ్ కదా!" అమాయకంగా మొహం పెట్టాడతను.

"పదాలు కావవి. పదమాలికలు. సాహితీ గుళికలు. సాహిత్య పరిభాషలో క... కవితలన్న మాట" చెప్పాడు భావాత్మకంగా.

"కవితలంటే ఇవా? అయినా ఈ కవితలు క్లైకూ బావా! నేనూ విన్పిస్తా విను... తవికల్ని..."

"తవికలా?" అంటూ నోరు బార్లా తెరిచాడు.

"పుట్టి బుద్దెరిగి సాహిత్యంలో నేనీ పదమే విన్లేదే! ఇలాంటి పైత్యమొకటి ఏడ్చి చచ్చిందా బావా!" ముషార్రఫ్ భారతదేశ పౌరసత్వం తీసుకున్నంత చిత్రంగా హాశ్చర్యపోయాడు గోపాలం.

"కవిగోపాలం బావా! నీవుండేది మండలంలో. నేనుండేది జిల్లా హెడ్‌క్వార్టర్‌లో. అవునా?" అనడిగాడు.

బదులుగా అవునన్నట్లు తలూపాడు కవిగోపాలం.

"మరి మండలం పెద్దదా.... జిల్లానా?" ప్రశ్నించాడు.

"జిల్లాయే..." బదులిచ్చాడు.

"సో... కవితలు మండలం లెవెలైతే తవికలు జిల్లా స్థాయివి అన్నమాట" చెప్పుకు పోతున్నాడు పరమేశం.

"కవిత్వం కూడా గ్రామ, మండల, జిల్లా, నగరాల వారీగా విభజింపబడి వుంటుందా?" గింజుకున్నాడు కవి గోపాలం.

"మరి... నేనో తవిక విన్పించనా?" ఉత్సాహంగా అడిగాడు పరమేశం.

"తప్పదనుకుంటే..." కవి గోపాలం అన్నాడు జేవురించిన మొహంతో.

గొంతు సవరించుకున్నాడు పరమేశం.

"కవీ, నీవు కవివా
కాదు కాదు కత్తివి
నరాల్లో గుచ్చుతావు
గుండెని పరపరా కోస్తావు
....నీ కవితతో!
కవీ, నీవు కవివా
కాదు కాదు కత్తివి"

ఆ తవిక విన్నాక కవి గోపాలం కెవ్వుమని అరిచాననుకుంటూ అరవకుండానే విరుచుకుపడిపోయాడు.

అది మొదలు పరమేశం గోపాలంపై అలా తవికల్తో దాడి చేస్తునే ఉన్నాడు.

* * *

తన కవితల మాట దేవుడెరుగు, తవికలు వినకుండా వుంటే చాలని

పరమేశానికి కనపడకుండా దాక్కుంటున్నాడు. ఇంకా ఎన్ని రోజులుంటాడో గురుడు అని తిట్టుకుంటూ ఆఫీసయ్యాక అర్ధరాత్రి దాటాకగానీ ఇంటికి చేరడంలేదు. పరమేశం కంట్లో పడకూడదని.

ఎప్పటిలాగే ఓ రోజు అర్ధరాత్రి వచ్చి బెడ్ రూమ్‌లో దూరి తలుపేశాడు. నిశ్శబ్దంగా భార్య పక్కన చేరాడు.

"తిండీ తిప్పలు మాని రోజూ ఇంత రాత్రి దాకా ఎటెల్తున్నారండీ" అంటున్న భార్య నోటికి అరచేతులు అడ్డం పెట్టి "ష్! గట్టిగా మాట్లాడకు" అన్నాడు.

అంతలో దడదడమంటూ తలుపులు బాదిన చప్పుడు... దాంతో పాటే బెడ్ కూడా కంపించిన భ్రాంతి.... అంతే, "భూకంప... భూకంపం..." అంటూ అరిచాడు కవి గోపాలం.

"ఛ... ఊర్కోండి... ఇప్పుడు భూకంపమేంటి మీపిచ్చి కాకపోతే! తాగొచ్చారా? పరమన్నయ్య తలుపులు బాదుతున్నట్టున్నాడు. ఉండండి. తీస్తాను" అంటూ వెళ్ళి తలుపు తీసింది.

పంచప్రాణాలు బిగపట్టాడు కవిగోపాలం.

గదిలోకి సర్రున దూసుకొచ్చిన పరమేశం సరాసరి కవిగోపాలం చెంతకు చేరి. "వచ్చావా బావా? ఈ రాత్రి లోగా వస్తావో రావోనని కంగారు పడ్డాను. ఓ సూపర్ డూపర్ తవిక లేటెస్ట్‌గా మైండ్‌లో రివైండ్ అయ్యింది అది నీకు విన్పించి, విన్నానందింప చేయాలని పరుగు పరుగున వచ్చాను" అన్నాడు.

"ఈ సమయంలోనా...!" పై ప్రాణాలు పైనే పోయాయి కవిగోపాలంకి.

పరమేశాన్ని చూస్తుంటే తెగ మండుతోంది.

"కాలయాపనెందుకు. తవిక విను బావా!" అంటూ జేబులోంచి ఓ చిన్నపాటి కాగితపు ఉండని బయటకు తీశాడు. దాన్ని గనక విప్పుకుంటూ పోతే అర కిలోమీటరంత వుంటుంది.

ఆ కాగితపు ఉండని చూస్తూనే కళ్ళు బైర్లు కమ్మినయ్ కవి గపాలంకి. చల్ల చెమట్లు పోశాయి. అవన్నీ చదవడు కదా... అని బెంబేలెత్తి పోయాడు. వీళ్ళ వ్యవహారం పట్టనట్టు కవి గోపాలం భార్య ముసుగు తన్ని పడుకుందెప్పుడో!

మొదలెట్టాడు పరం. గొంతుని రాగభరితం చేస్తూ.

విన్పించి ఏడ్పించడమే తప్ప వినడం తెలియదుగా కవిగోపాలంకి. వింటే ఎలా ఉంటుందో తొలిసారిగా రుచి చూస్తుంటే ఏడుపొక్కటే తక్కువవుతోంది. భరించలేకపోయాడు.

ఈ రాత్రి గడిస్తే చాలనుకుని బయటకు పరుగో పరుగు.

❋ ❋ ❋

ఇదండీ మన కవిగోపాలం కథ!

మరి ముగింపేంటంటారా?....

"వద్దూ.... వద్దూ...." అని అరుస్తున్నాడు కవిగోపాలం. పూనకం వచ్చిన వాడిలా బెడ్ మీదే ఊగిపోతూ.

"ఏవండీ! ఏవండీ! ఏమైందీ...?" అంటూ గాభరాగా తట్టి లేపింది భార్య ఉమ.

"వద్దు... వద్దు...." ఆగకుండా అరిచాడు మళ్ళీ.

మెలకువలోనే కలగా.... కలలోనే మెలకువగా...

"పర్లేదు లేవండి. మా అన్నయ్యని వాళ్ళూరికి పంపించాన్లెండి" అంది ముసిముసిగా నవ్వుతూ.

అమృత జల్లులా ఆ మాట చెవిని సోకగానే దిగ్గున లేచి కూర్చున్నాడు కవిగోపాలం.

"హమ్మయ్య! తిక్క కుదిరింది. పిచ్చి కాస్తా వదిలింది. అంతా మా అన్నయ్య పుణ్యం" అనుకుంది ఆ ఇల్లాలు.

"కవిత్వం రాయను గాక రాయను. ఆ దిక్కుమాలిన కవిత్వమంటే విరక్తి పుడుతోంది...."అంటున్న భర్త మాటలకి తెగ సంబరపడి పోయిందామె.

"... అందుకని ఇక కథలు రాయడం మొదలెడ్తాను..." అన్నాడు ఫైనల్ టచప్ ఇస్తూ.

అది విని దబ్బున కింద పడిపోయిందా ఇల్లాలు. మరుక్షణమే స్పృహ కోల్పోసాగింది.

(02.07.02003)

❖